# జాతీయం

## ఆర్థిక నేరగాళ్ళ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తులు చట్టపరమైన ప్రక్రియను తప్పించుకునే యత్నం చేయకుండా గట్టిగా నిరోధించేందుకు ఉద్దేశించిన పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల బిల్లు – 2018 కు ఆగస్టు 5న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.

- ❖ ఈ బిల్లును లోక్‌సభ జులై 19న, రాజ్యసభ జులై 25న ఆమోదించాయి.

**బిల్లు ముఖ్యాంశాలు:**

- ❖ భారత నేర శిక్షాస్మృతి, అవినీతి నిరోధక చట్టం, సెబీ చట్టం, దివాళా, కస్టమ్స్, కంపెనీ చట్టాలు కింద నిర్వచించిన ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిని ఈ బిల్లు పరిధిలోకి తెస్తారు.
- ❖ రూ.100 కోట్లకు పైబడి ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు బిల్లు పరిధిలోకి వస్తారు.
- ❖ భారీ ఆర్థిక నేరాలు చేసినవారు దేశం విడిచి పారిపోకుండా, న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకోకుండా బిల్లు నిరోధిస్తుంది.

**ఆర్థిక నేరగాడు అంటే:**

- ❖ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆర్థిక నేరానికి పాల్పడిన వ్యక్తిపై ఏదేని కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసినపుడు.
  - – నేర విచారణ ప్రక్రియ నుంచి తప్పించుకోవడానికి అతను దేశం విడిచి పారిపోతే.
  - – విచారణ ఎదుర్కొనడం కోసం భారతదేశానికి తిరిగి రావడానికి నిరాకరిస్తే అతన్ని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడుగా పరిగణిస్తారు.

**ఆర్థిక నేరగాడి ప్రకటన విధానం:**

- ❖ పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు అని ప్రకటించాలంటూ కేంద్ర ప్రభుత్వం నియమించిన డైరెక్టర్ ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

  సెక్షన్ 6లోని క్లాజు (2) ప్రకారం –
  - – అతను ఆర్థిక నేరగాడు అని విశ్వసించే కారణాల్ని చూపాల్సి ఉంటుంది.
  - – అతను ఎక్కడున్నాడో సమాచారం తెలిస్తే దానిని కోర్టుకు తెలియజేయాలి.
  - – నేరానికి కారణమైన ఆస్తుల జాబితా (భారత్‌లోను, విదేశాల్లోను) చెబుతూ వాటి జప్తును కోరితే వాటి వివరాలు చెప్పాలి.
- ❖ నేరగాడి ఆస్తుల జప్తును కోరితే వాటి వివరాలు తెలియజేయాలి.
- ❖ సంబంధిత ఆస్తుల్లో ప్రయోజనాలు కలిగిన వ్యక్తుల జాబితాను వెల్లడించాలి.
- ❖ నిందితుల ఆస్తుల్ని జప్తుచేసే అధికారం డైరెక్టరుకు ఉంటుంది.

**నేరస్థుడి బాధ్యతలు:**

- ❖ పరారీలో ఉన్న నేరస్థుడి పేరిట కోర్టు నోటీసు జారీచేస్తుంది.
- ❖ ఇది జరిగిన ఆరు వారాల్లోగా నిర్దిష్ట స్థలం, ప్రదేశంలో ఆ వ్యక్తి హాజరు కావాల్సి ఉంటుంది.
- ❖ ఒకవేళ అతను అలా చేయలేకపోతే పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడుగా ప్రకటిస్తారు.
- ❖ ఈ నేరగాళ్ళు కోర్టులో సివిల్ క్లెయిమ్‌కు దాఖలు చేయకుండా సమర్థించుకోకుండా సెక్షన్–II నిరోధిస్తుంది.

**ఆస్తుల జప్తు – బాధ్యత:**

- ❖ జప్తు చేసిన ఆస్తుల్ని పర్యవేక్షించడానికి ప్రత్యేక కోర్టు ఒక పాలనాధికారిని నియమిస్తుంది.
- ❖ ఆస్తుల్ని విక్రయించే బాధ్యత ఆ అధికారిపై ఉంటుంది. నష్టపోయిన వారి క్లెయిమ్‌లను సంతృప్తపరచడానికి ఆస్తుల్ని వినియోగించాలి.

## ఎస్సీ, ఎస్టీ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టంలో తొలుతఉన్న నిబంధనలను పునరుద్ధరించడానికి ఉద్దేశించిన బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**నేపథ్యం:**

- ❖ ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసుల నమోదుకు సంబంధించి 2018 మార్చిలో భారత సుప్రీంకోర్టు కీలకవ్యాఖ్యలు చేసింది.

**సుప్రీం వ్యాఖ్యలు:**

- ❖ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధక చట్టంలోని కఠినమైన నిబంధనల వల్ల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతోందని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది.
- ❖ ముఖ్యంగా ప్రాథమిక విచారణ కూడా లేకుండా ఏకపక్షంగా అరెస్టులు చేయడం కుదరదని తెలిపింది.
- ❖ ఇందుకు రాజ్యాంగంతోపాటు ఏ చట్టం కూడా అనుమతించదని స్పష్టం చేసింది.
- ❖ నిందితులు ముందస్తు బెయిలు పొందవచ్చుని, ఇది చట్టం కల్పించిన హక్కు అని తెలిపింది.
- ❖ ఈ చట్టం కింద కేసులు నమోదు చేయవద్దని తాము చెప్పడం లేదని, నిర్దోషులు, అమాయకులు బాధితులుగా మారకుండా ప్రాథమిక విచారణ జరిగిన తర్వాతే కేసు నమోదు చేయాలని సూచించింది.
- ❖ ఈ తీర్పు వల్ల ఎస్సీ, ఎస్టీ చట్టం నీరుగారదని, ఏకపక్ష అరెస్టుల నుంచి నిర్దోషులను కాపాడడమే తమ ఉద్దేశ్యమని తెలిపింది.

**కేంద్ర ప్రభుత్వ స్పందన:**

- ❖ సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ, ఎస్టీ చట్టం బలహీనమౌతుందన్న వాదనతో కేంద్ర ప్రభుత్వం తొలుత ఏకీభవించలేదు.
- ❖ ఈ తీర్పుతో కేంద్రానికి సంబంధంలేదని అది న్యాయవ్యవస్థకు సంబంధించినదనే వైఖరి ప్రదర్శించింది.
- ❖ ఈ నేపథ్యంలో పౌరసంఘాలు, దళిత సంఘాలు, ఈ తీర్పుపై కేంద్ర వైఖరిపై ఆందోళనలు చేపట్టాయి.
- ❖ ఏప్రిల్ 2న దేశవ్యాప్తంగా చేపట్టిన 'భారత్ బంద్' హింసకు దారితీసి 10 మంది దాకా మరణించారు.
- ❖ 2018 ఆగస్టు 9న మరోమారు 'భారత్ బంద్'కు పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజా సవరణలకు ఆమోదం తెలిపింది.

**ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్ట ప్రకారం:**

- ❖ ఎలాంటి ప్రాథమిక దర్యాప్తు లేకుండానే కేసు నమోదు చేయవచ్చు. పై అధికారులు అనుమతితో నిమిత్తం లేకుండానే నిందితులను అరెస్టు చేయవచ్చు.

- సెక్షన్ 438 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద నిందితులు ముందస్తు బెయిలు పొందేందుకు అవకాశం ఉండదు.

**తాజా బిల్లు ముఖ్యాంశాలు:**

- ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులకు కోర్టు ఉత్తర్వులున్నా ముందస్తు బెయిల్ ఇవ్వడానికి వీల్లేదు.
- ఈ చట్టం కింద క్రిమినల్ కేసు నమోదుకు ఎలాంటి ప్రాథమిక విచారణ అవసరం లేదు.
- అరెస్టుకు ఎవరి ఆమోదం అవసరం లేదు.

# భారత్ - ప్రపంచం

## భారత్‌కు వ్యూహాత్మక వాణిజ్యహోదా-1 ఇచ్చిన అమెరికా

అమెరికా తనకు అత్యంత సన్నిహిత మిత్రపక్షమైన ఇజ్రాయెల్‌కు కూడా ఇప్పటివరకూ ఇవ్వని వ్యూహాత్మక వాణిజ్య హోదా-1 (ఎస్‌టిఎ-1) భారతదేశానికి ఇచ్చింది.

**ముఖ్యాంశాలు:**

- దక్షిణాసియాలో ఈ హోదా పొందిన మొట్టమొదటి దేశంగా జపాన్, దక్షిణ కొరియా తర్వాత ఈ హోదా పొందిన మూడో ఆసియా దేశంగా భారత్ గుర్తింపు పొందింది.
- సాధారణంగా నాటో దేశాలకు మాత్రమే అమెరికా ఈ హోదా ఇస్తూ ఉంటుంది.
- ప్రపంచం మొత్తమ్మీద ఇప్పటివరకు 36 దేశాలకు మాత్రమే ఈ హోదా ఉండగా ఇపుడు 37వ దేశంగా భారత్ నిలిచింది.
- ఈ మేరకు అమెరికా 2018 ఆగస్టు 3న నోటిఫికేషన్ జారీ చేసింది.

**భారత్‌కు చేకూరే ప్రయోజనాలు:**

- భారత్‌కు హైటెక్నాలజీ ఉత్పత్తుల విక్రయాలకు మార్గం సుగమం అవుతుంది.
- ముఖ్యంగా అంతరిక్షం, రక్షణ రంగాల్లో హైటెక్నాలజీ ఉత్పత్తుల దిగుమతికి వీలు కలుగుతుంది.
- న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్ఎస్‌జి)లో సభ్యత్వం దిశగా భారత్ మరో అడుగు ముందుకు వేసినట్లు అవుతోంది.

**నేపథ్యం:**

- అల్బేనియా, హాంకాంగ్, ఇజ్రాయెల్, మాల్టా, సింగపూర్, దక్షిణాఫ్రికా, తైవాన్ తదితర దేశాలతో కలిపి భారత్‌కు ఇప్పటివరకూ ఎస్‌టిఎ-2 హోదా మాత్రమే ఉంది.
- మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజైమ్ (ఎమ్‌టిసిఆర్), వాసెనార్ అరేంజ్‌మెంట్ (డబ్ల్యుఎ), ఆస్ట్రేలియా గ్రూప్ (ఎజి), న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్ఎస్‌జి)ల్లో సభ్యత్వం ఉన్న దేశాలకే అమెరికా ఎస్‌టిఎ-సభ్యత్వం ఇస్తూ ఉంటుంది.
- గత మూడేళ్ళలో మిగిలిన మూడు సభ్యత్వాలను భారత్ సాధించినా ఎన్ఎస్‌జిలో సభ్యత్వానికి చైనా పదేపదే అడ్డు తగులుతున్నది.
- అయితే ఇపుడు చైనా-అమెరికా వాణిజ్యం వివాదాలు కొనసాగుతున్నాయి. ఇవి తారాస్థాయికి చేరుకున్నాయి కూడా.
- ఈ నేపథ్యంలో చైనాకు రాజకీయంగా గట్టి సందేశం పంపడమే ధ్యేయంగా భారత్‌కు ఎన్ఎస్‌జి సభ్యత్వం నుంచి మినహాయింపు ఇచ్చి మరీ అమెరికా ఎస్‌టిఎ-1 హోదా కట్టబెట్టింది.
- తద్వారా ఎన్ఎస్‌జి ఎగుమతి నియంత్రణ విధానాలకు భారత్ కట్టుబడి ఉంటుందని అమెరికా గుర్తించినట్లు అయింది.
- అంతేకాక ప్రపంచంలో ఈ హోదా పొందిన ఏకైక అణ్వాయుధ దేశంగానూ భారత్ నిలిచింది.

# నివేదికలు

## స్వచ్ఛ భారత్‌పై - ప్రపంచ బ్యాంక్ నివేదిక

పారిశుధ్యమే లక్ష్యంగా 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన స్వచ్ఛభారత్ కార్యక్రమం - గ్రామీణ (ఎస్‌బిఎమ్-జి) భారతదేశంలో ఆరోగ్య బాటలు వేస్తోంది.

- మహాత్మాగాంధీ 150వ జయంతి 2019 అక్టోబరు 2 నాటికి దేశవ్యాప్తంగా 100 శాతం ఈ కార్యక్రమాన్ని అమలు చేయగలిగితే మూడు లక్షల ప్రాణాలు కాపాడవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పేర్కొంది.

**ముఖ్యాంశాలు:**

- పరిశుభ్రతతో ముడిపడి ఉన్న డయేరియా, పోషకాహార లోపం బాధితులు ఈ మేరకు మృత్యువు నుండి బయటపడతారని వెల్లడించింది.
- ఇప్పటికే స్వచ్ఛభారత్ కారణంగా లక్షా 80 వేల మంది మృత్యువాత పడకుండా ప్రాణాలతో ఉన్నారని తెలిపింది.
- ముఖ్యంగా 2014తో పోలిస్తే 2018 ఆగష్టు 2 నాటికి గ్రామాల్లో పరిశుభ్రత 89.07 శాతం మెరుగు పడిందని వెల్లడించింది,

**డబ్ల్యూ. హెచ్.ఓ నివేదిక ప్రకారం:**

- అపరిశుభ్రత కారణంగా ఏటా 19.9 కోట్ల మంది నీళ్ళ విరోచనాలతో బాధపడుతున్నారు. ఐదేళ్ళలోపు చిన్నారులు ఎక్కువగా మృత్యువాత పడటానికి డయేరియా ముఖ్య కారణం. చిన్నారులను బలి తీసుకుంటున్న వ్యాధుల్లో ఇది రెండో స్థానాన్ని ఆక్రమించింది.
- పారిశుధ్యం మెరుగుపడటంతో స్వచ్ఛమైన నీరు త్రాగేవారు సైతం గణనీయంగా పెరిగారు.
- పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయడంవల్ల వ్యాపించే ఉష్ణమండల వ్యాధులు, తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లను, కీటకాల ద్వారా అంటుకునే రోగాలు తగ్గు ముఖం పట్టాయి.

**మరుగుదొడ్ల నిర్మాణంలో 100 శాతం ప్రగతి సాధించిన రాష్ట్రాలు:**

- కేంద్ర గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య మంత్రిత్వశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ఇళ్ళల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో నూరుశాతంతో ఐదు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులు మొదటి స్థానంలో నిలిచింది. 1) అండమాన్ నికోబార్ దీవులు; 2) ఆంధ్రప్రదేశ్; 3) అరుణాచల్ ప్రదేశ్; 4) చండీగఢ్; 5) ఛత్తీస్‌గఢ్
- అధమ స్థానంలో ఉన్న రాష్ట్రాలు : 1) ఒడిశా (59.98), 2) బీహార్ (62.02), 3) గోవా (76.22), 4) త్రిపుర (76.55), 5) ఝార్ఖండ్ ( 84.86)

**2014 అక్టోబర్ 2 నుంచి పోలిస్తే 2018 నాటికి బహిరంగ మలవిసర్జన రహితంగా మారినవి.**

| | |
|---|---|
| గ్రామాలు | - 4,11,332 |
| గ్రామ పంచాయితీలు | - 1,81,899 |
| జిల్లాలు | - 421 |
| రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు | - 9 |
| నిర్మించిన మరుగుదొడ్లు | - 8,01,34,862 |